ప్రజాశక్తి
సోమవారం 17 నవంబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు

గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మూడవరోజు ఆదివారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని ఎస్ సునీత మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని చెప్పారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతిరోజు వచ్చి చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓఎస్ కే సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాస రచన రాస్తున్న విద్యార్థులు

విద్యా, ఉపాధి రంగాల్లో ఆదివాసీల అభివృద్ధికి పథకాలు

బిర్సా ముండా జయంతి సభలో ఒడిశా సిఎం

ప్రజాశక్తి -పాడేరు: విద్యా, ఉపాధి రంగాల్లో ఆదివాసీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు అమలు చేస్తున్నాయని ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ వెల్లడించారు. ఆదివాసి పోరాట యోధుడు బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా పాడేరు మండలం చింతల వీధిలో ఏర్పాటు చేసిన బిర్సా ముండా విగ్రహాన్ని ఆదివారం మధ్యాహ్నం ఆయన ఆవిష్కరించారు. అనంతరం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, గిరిజన వీరుల స్మారకార్థం దేశవ్యాప్తంగా 10 మ్యూజియంలు ఏర్పాటు చేశామన్నారు. వాటిలో ఒకటి ఆంధ్రప్రదేశ్లో లంబసింగిలో ఉందన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన తెగల ప్రజలు మరింత భద్రత, స్వీయపాలనతో జీవిస్తున్నారని పేర్కొన్నారు గిరిజన సమాజం దేశ అభివృద్ధికి ముఖ్య భాగస్వామిగా నిలుస్తోందని చెప్పారు.

వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ,నిజమైన గిరిజన స్వాతంత్ర్య సమరయోధులకు గౌరవం కల్పించేందుకు కేంద్రం 'జనజాతీయ గౌరవ్ దివస్'గా 2021లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారుపార్వతీపురం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని వేగవంతం చేసి ప్రారంభ దశకు తీసుకువచ్చామన్నారు రంపచోడవరం, పార్వతీపురం, డోర్నాల, సీతమ్మపేటలో 100 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం జరుగుతోందనీ . రాష్ట్ర శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ, మన్యం అల్లూరి రెండు జిల్లా లో ఒరిస్సా ఆంధ్రా సరిహద్దు గ్రామాల్లో సాలూరు నియోజకవర్గం లోని 21 గిరిజన గ్రామాల ప్రజలు రోడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.. ఆయా సరిహద్దు గ్రామాల రోడ్లను అభివృద్ధి చేయాలని ఒడిశా సీఎంను కోరారు. పివిటిజీల కోసం పీఎం జన్మన్ యోజన ప్రారంభిం చారలన్నారు . వచ్చే సంవత్సరం నుంచి ప్రతి గ్రామంలో బిర్సా ముండా కార్యక్రమాలు నిర్వహించి, గిరిజన హక్కులు, సంప్రదాయాల రక్షణ కోసం కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న సిఎం మోహన్ చరణ్ మాఝీ

ఒడిశా సిఎంకు ఘన స్వాగతం

పాడేరు: అల్లూరి జిల్లా లగిసపల్లి హెలిపాడ్ వద్ద ఒడిశా ముఖ్యమంత్రికి గిరిజన సాంప్రదాయాలతో ఘన స్వాగతం పలికారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్, మంత్రులు సంధ్యారాణి, సత్య కుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీ పూజ, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జి సి సి చైర్మన్ శ్రావణ్‌లు స్వాగతం పలికారు.

సరిహద్దు వివాదాలపై ఊసెత్తని ఒడిశా సిఎం

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: పాడేరులో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ చేసిన ప్రసంగంలో ఆదివాసీల అసలు సమస్యలను పూర్తిగా విస్మరించారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం విమర్శించారు. పాడేరు జిల్లా కేంద్రంలో ఆదివారం బిర్సా ముండా జయంతి వేడుకల్లో పాల్గొన ఒడిశా ముఖ్యమంత్రి బిర్సా ముండా వంటి మహానుభావుడి జయంతిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సిగ్గుచేటు చర్య అని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కె.లోకనాథం అరకులోయలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఒడిశా ముఖ్యమంత్రి తన ప్రసంగంలో రాష్ట్ర సరిహద్దు సమస్యలపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఆశ్చర్యకరమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దులోని కోటియా పంచాయతీ వంటి ప్రాంతాల్లో ఆదివాసీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నప్పటికీ, వాటిని ప్రస్తావించ లేదనాన్నరు.గిరిజన మంత్రి సంధ్యా రాణి చేసిన అభ్యర్థనను పక్కన పెట్టి వ్యవహరించడం ఆదివాసీ సమాజానికి అవమానకరమన్నారు. ఆదివాసీలకు సంబంధించిన పదవులు, ప్రాతినిధ్యం విషయంలో ఒడిశా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ,ఇది వారి రాజకీయ ఉద్దేశాలను బట్టబయలు చేస్తోందని తెలిపారు.కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని సవరించి బలహీనపరచడం ద్వారా ఆదివాసీల జీవనోపాధిపై పెద్ద దెబ్బ కొట్టిందని మండిపడ్డారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పెసా గ్రామ సభకున్న అధికారాన్ని ధిక్కరిస్తూ ఆదేశించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.బిర్సా ముండా ఉత్సవాల పేరుతో ఆదివాసీల భూమి హక్కులు, అటవీ ఉత్పత్తులపై నిర్లక్ష్యం చేసి కార్పొరేట్ శక్తులకు అప్పగించడం బిర్సా ముండా ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు.కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల సమస్యలను పరిష్కరించకుండా, కేవలం ఉత్సవాలు జరపడం ద్వారా బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తోందన్నారు.బిర్సా ముండా వంటి స్వాతంత్ర్య సమరయోధుడు ఆశయాలు ఆదివాసీల భూమి, అటవీ,సంస్కృతి రక్షణపై ఆధారపడి ఉన్నాయని, తెలిపారు. ఒడిశా ముఖ్యమంత్రి ప్రసంగం ఈ విషయాలను పూర్తిగా పక్కనపెట్టి, రాజకీయ ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. ప్రభుత్వాలు తక్షణమే సరిహద్దు సమస్యలు, అటవీ హక్కులు, గిరిజన ప్రాతినిధ్యం విషయాల్లో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స, మండల కార్యదర్శి కె. రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోకనాథం

అసంపూర్తిగా పాఠశాల భవనం

- కమ్యూనిటీ హాల్లో తరగతుల నిర్వహణ - అవస్థలు పడుతున్న విద్యార్థులు

అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం పనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: "అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని అన్న చందంగా మండలంలోని కొర్ర పెద్దపాడు జిపిఎస్ పాఠశాల భవనం పరిస్థితి తయారయింది. "నాడు నేడు పథకం ద్వారా ఒకటో విడతలో భవన నిర్మాణానికి నిధులు మంజూరు అయినా ఇప్పటివరకు పాఠశాల భవనం పూర్తి కాకుండా అసంపూర్తిగా దర్శనమిస్తుంది. దీంతో, అక్కడ చదువుతున్న గిరి విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మండలంలోని కొర్ర పెదపాడు పివిటిజి గ్రామంలో జిపిఎస్ పాఠశాలకు భవనం లేక ఆ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఆ గ్రామానికి చెందిన కమ్యూనిటీ భవనంలో చదువులు కొనసాగిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయంలో నాడు నేడు ఒకటవ విడత కింద పాఠశాల భవనానికి నిధులు మంజూరు అయ్యాయి. పాఠశాల భవనం పూర్తిగా నిర్మించకుండా గత మూడు, నాలుగేళ్ల క్రితం పిల్లర్స్ నిర్మించి, బేస్మెంట్ వేసి ఆరడుగుల వరకు ఇటుకలు లేపి మధ్యలో అసంపూర్తిగా వదిలేశారు. దీంతో పాఠశాల భవనం లేక కొన్నాళ్లపాటు ఆ గ్రామానికి చెందిన ఓ నివాస గృహంలో తరగతులు నిర్వహించి ఆ తర్వాత కమ్యూనిటీ భవనంలో తరగతుల నిర్వహణ కొనసాగిస్తున్నారు. ఈ పాఠశాలలో కుర్ర పెదపాడు గ్రామం తో పాటు శెట్టి బంధ పివిటిజి గ్రామానికి చెందిన విద్యార్థులు సైతం అక్కడ చదువుకుంటున్నారు. ఈ రెండు గ్రామాలకు ఒకటే పాఠశాల ఉంది. సుమారు 49 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తరగతులు నిర్వహించడానికి ఒకటే గది కావడంతో విద్యార్థులకు ఇరుకుగా ఉండడంతో పలు ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని పూర్తిగా నిర్మించి వినియోగంలో తీసుకు రావాలని పలుమార్లు సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదని ఆ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

సామాజిక భవనంలో నిర్వహిస్తున్న పాఠశాల తరగతి

గిరిజన గ్రామాల్లో తుపాన్‌కు దెబ్బతిన్న రోడ్లు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ ప్రభావ కారణంగా మారుమూల గిరిజన గ్రామాల రోడ్లు కోతకు గురి కావడంతో రాకపోకలు సాగించే వాహనాల చోధకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేంగడ పంచాయతీలో బీటి రోడ్డు మరమ్మతుకు గురైంది. దీంతో, వెంగడ పంచాయతీతో పాటు హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ పరిధి పలు గ్రామాల గిరిజన ప్రజలు మండల కేంద్రం లేదా ఇతర పనుల నిమిత్తం ఎస్.కోట. విజయనగరం, వైజాగ్ .నిత్యం ఆ రోడ్డు మార్గాన రాకపోకలు నిర్వహిస్తుంటారు. తుఫాను దాటికి వాలసి నుండి మెట్టువలస, జంబువలస వేంగడ. నుండి డొంకపుట్టు వరకు సుమారు 20 కిలోమీటర్లు వరకు పలు చోట్ల ఎక్కడపడితే అక్కడ వరద కోతకు గురై గోతులు మయంగా ఏర్పడింది దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని. ఇప్పటికైనా సరే తక్షణమే కూటమి ప్రభుత్వం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని గిరిజన గ్రామాల గిరిజన ప్రజలు కోరుతున్నారు.

తుపానుకు మరమ్మతుకు గురైన వేంగడ రోడ్డు

కార్మికులకు...

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

రంపచోడవరంలో సిఐటియు నాయకులు, కార్యకర్తల భారీ ప్రదర్శన

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు
- ఉత్సాహంగా ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా మహాసభ
- కదంతొక్కిన కార్మికులు
- వీధుల్లో అరుణపతాక రెపరెపలు
- ఆకట్టుకున్న ప్రజానాట్యమండలి కళాకారుల నృత్యాలు

ప్రజాశక్తి - రంపచోడవరం: కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం రంపచోడవరం కేంద్రంలో సిఐటియు జిల్లా మహాసభ ఉత్సాహంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే ఈ మహాసభలో ఆదివారం తొలుత స్థానిక పూనం సత్యనారాయణనగర్ నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా దేవిగుడి నుంచి సభావేదిక వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలన్నారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని అయితే దీనికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ కనీస వేతన విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని దీనివల్ల కార్మికులకు రోజుకు రూ.180 వేతనం అందుతుందని ఆ వేతనంతో రోజువారీ కార్యకలాపాలు ఎవరైనా నడపగలరా అని ప్రశ్నించారు. పనిగంటలను పెంచేందుకు ప్రయత్నించడం కూడా సరికాదన్నారు. మహిళలతో రాత్రి సమయాల్లో పనిచేయిం చేందుకు కొత్తగా కార్మికచట్టాలు రూపొందిస్తున్నారని దీనివల్ల మహిళలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పించాలన్నారు. స్కీంవర్కర్ల పేరుతో శ్రమదోపిడీ జరుగుతోందని, నిజంగా ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలే కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా ఇచ్చి వారిని పర్మినెంట్ చేయాలన్నారు. విద్యుత్‌చార్జీలు సామాన్యుడి నడ్డివిరిచేవిధంగా వస్తున్నాయని, స్మార్ట్‌మీటర్ల వ్యవస్థను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను కూడా వ్యతిరేకించాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమనిధిని విడుదల చేసి అమలు చేయాలన్నారు. ఆటోకార్మికుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారానికి నోచుకోలేదన్నారు. గిరిజనులకు శతశాతం వారి ఉద్యోగాలు వారికే ఇవ్వాలన్నారు. పలు రంగాల్లోని కార్మికులంతా ఒకేతాటిపైకి వచ్చి ఐక్యంగా ఉద్యమిస్తే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పై సమస్యలు పరిష్కరించకపోతే రానున్న కాలంలో ఉద్యమాలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే ఆల్ ఇండియా మహాసభలలో ఇదే ఉత్సాహంతో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పెన కిరణ్ మాట్లాడుతూ హైడ్రా ప్రాజెక్టు పేరుతో పాడేరు, అరకు ప్రాంతంలో విలువైన ఖనిజ సంపద కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని దీనిని సమిష్టిగా వ్యతిరేకించాలన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి నిర్మల, సిఐడి జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాంబాబు కె.శాంతిరాజు, పి.రామరాజు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లె రెడ్డి, సిఐటియు ఉపాధ్యక్షులు రాజేశ్వరి లక్ష్మణ్ రాంబాబులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

విప్లవ వందనం చేస్తున్న నాయకులు

బెల్టు షాపుల దందా..ఎక్సైజ్ ఉందా..!

ప్రజాశక్తి-చింతూరు: చింతూరు ఏజెన్సీలో బెల్ట్ షాపుల దందా నడుస్తోంది. డివిజన్ వ్యాప్తంగా సుమారు 400 బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. వీరి వద్ద నుండి ఎక్సైజ్ శాఖకు ప్రతినెలా సుమారు రూ.2 లక్షల వరకూ అందుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఒడిశా రాష్ట్రం నుండి ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన చింతూరు డివిజన్‌కు అత్యధికంగా తరలుతోంది. బెల్ట్‌షాపుల్లో మద్యం ధరలు చుక్కలనంటుతున్నాయి. బ్రాండెడ్ మద్యం లైసెన్స్ షాపుల్లో లభించడం లేదని పక్క గ్రామాల్లో మండల కేంద్రంలో ఉన్న బెల్ట్ షాపులకు అధికంగా తరలి వెళుతోందని లైసెన్స్ షాపుల్లో మద్యాన్ని బెల్టు షాపులకు విక్రయించి కొల్లగొడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. చింతూరు. కూనవరం. విఆర్ పురం, ఎటపాక మండలాలకు అక్రమ మద్యం తరలి వెళుతోంది. మండలంలోని ఏ గ్రామానికి వెళ్లినా బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది.

వలిసె విరిసె..మనసు మురిసె..

అల్లూరి సీతారామరాజు జిల్లా బొడ్డగండి పంచాయతీ బచ్చులూరు సమీపంలో వలిసె పువ్వులు చూడచక్కగా విరబూసాయి. భూమాతకు పసుపు పచ్చని చీర సింగారించినట్టుగా చూపరుల చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తున్నాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈ పువ్వులు చాలా అందంగా ఉంటాయి. పర్యాటకులు వీటి అందానికి ఫిదా అవుతూ తమ కెమెరాల్లో క్లిక్ అనిపిస్తూ భద్రపరుచుకుంటున్నారు. - ప్రజాశక్తి, సీలేరు

డాక్టర్ మాటూరికి సాహిత్య పురస్కారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: నగరానికి చెందిన కవి, రచయిత, ప్రముఖ వైద్యులు డాక్టర్ మాటూరి శ్రీనివాస్‌కు గెద్దాడ బ్రహ్మయ్య మెమోరియల్ ట్రస్ట్ సాహిత్య పురస్కారం 2025 దక్కింది. కాకినాడకు చెందిన ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ కస్తూరి ప్రసాద్ (రాధిక) ఈ సంవత్సరం గెద్దాడ బ్రహ్మయ్య మెమోరియల్ ట్రస్ట్ వార్షిక రాధిక సాహితీ పురస్కారం డాక్టర్ మాటూరి శ్రీనివాస్ కి ప్రదానం చేస్తున్నట్టు పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. స్వరధార,తెరకోయ, దయాశోకం వంటి గ్రంథాలు రాసిన డాక్టర్ మాటూరి బౌద్ధ రచయితగా ప్రసిద్ధులు అన్నారు. ప్రస్తుతం ఆయన 'బుద్ధభూమి' పత్రిక గౌరవ సలహాదారుగా ఉన్నారు. నగరంలో సమతా సాహితి సంస్థను నెలకొల్పారు. ఈ సందర్భంగా డాక్టర్ మాటూరికి అరసం అధ్యక్షులు ఉప్పల అప్పలరాజు, సమతా సాహితి వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ బండి సత్యనారాయణ, బొజ్జ పావని, డాక్టర్ డి.వి సూర్యారావు భినందనలు తెలిపారు.

చలి పులి పంజా..

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరు దుప్పిలివాడ, ధారకొండ పరిసర ప్రాంతాల్లో రోజురోజుకీ చలి తీవ్రత అధికమవుతోంది. ఉదయం 8 గంటల వరకూ గిరిజనులు ఇళ్ల నుంచి బయటికి రావడానికి సాహసించడం లేదు. చలితో పాటు పొగ మంచు తీవ్రంగా కురుస్తోంది. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత అధికమవుతుందని ఆందోళన చెందుతున్నారు.

మంట వద్ద చలి కాచుకుంటున్న పిల్లలు

దుంబ్రిగుడ మండలం చాపరాయిలో పర్యాటకుల తాకిడి

పర్యాటక ప్రాంతాలు కిటకిట

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలో పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు పోటెత్తారు. దీంతో పర్యాటక ప్రాంతం పర్యాటకుల సందర్శనతో కిటకిటలాడింది. పర్యాటకులు జలపాతంలో స్నానాలు ఆచరిస్తూ ఆనందంగా గడిపారు. రోడ్డుకిరువైపులా మన భోజనాలు చేసుకుంటూ కుటుంబ సమేతంగా ఆటపాటలతో సందడి చేశారు.

అనంతగిరి: మండలంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. బొర్రా గుహలతో పాటు ఘాట్ రోడ్డు, డముకు వ్యు పాయింట్, కటిక, తాడిగుడ, చిల్లంపాడు వంటి పర్యాటక ప్రాంతాలు జనాలతో కిటకిటలాడాయి. ఘాట్ రోడ్డు, వ్యు పాయింట్లలో సెల్ఫీలు దిగారు. అనంతరం జలపాతాల్లో స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. కాఫీ ప్లాంటేషన్‌లో కాఫీ పొడిలు, ఇతర సరుకులు కొనుగోలు చేశారు. సుంకరమెట్ట వ్యు పాయింట్, వుడెన్ బ్రిడ్జిను తిలకించారు.

బొర్రా గుహల్లో పర్యాటకులు

రోడ్డు, కల్వర్టులను పరిశీలించిన జెఇ

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని కురిసిన మొంథా తుఫాన్‌తో వేంగడ రోడ్డు, బందవలస కల్వర్టు మరమ్మతు గురైనట్లు పంచాయతీ మాజీ సర్పంచ్, ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు సివెరి. కొండలరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పియర్ జెఇ. సాంబశివరావు సిబ్బందితో కలిసి ఆదివారం వేంగడ పంచాయతీ సందర్శించి తుపానుకు దెబ్బతిన్న రోడ్డు, బందవలస కల్వర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇ. మాట్లాడుతూ, తుఫాను కారణంగా రోడ్డు పాడైందని స్థానిక నాయకులు కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో వాస్తవ పరిస్థితుల్లో పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ చంటి, పేసా కమిటీ సభ్యులు ఎం. రామన్న పాల్గొన్నారు .

కల్వర్టును పరిశీలిస్తున్న జెఇ

వ్యాక్సినేషన్‌తో శిశువుకు ఇన్‌ఫెక్షన్

- కెజిహెచ్‌లో విషమ పరిస్థితిలో చికిత్స
- చింతపల్లి వైద్యుల నిర్వాకంపై ఆందోళన
- తమకు న్యాయం చేయాలని తల్లిదండ్రుల వేడుకోలు

ప్రజాశక్తి-చింతపల్లి: శిశువు పుట్టిన వెంటనే ఇచ్చే బిసిజి, ఒపివి, హెపటైటిస్-బి వంటి టీకాలు సకాలంలో, సక్రమంగా ఇవ్వకపోవడం వల్ల ఎముకకు ఇన్ఫెక్షన్ వచ్చిందంటూ తల్లిదండ్రులు తీవ్రమైన ఆరోపణలు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, శిశువుకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. చౌడుపల్లి పంచాయతీ వాముగడ్డ గ్రామానికి చెందిన వంతల దణేష్, సత్యవతి దంపతులకు గత నెల 9న చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో మగ శిశువు జన్మించింది. పుట్టిన రోజు వేయవలసిన టీకాలు సక్రమంగా వేయకపోవడం వల్ల మూడు రోజుల తర్వాత డిశ్చార్జ్ అయిన అనంతరం బిడ్డకు ఇంజెక్షన్ ఇచ్చిన చోట వాపు రావడంతో తిరిగి ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిపారు. అక్కడ వైద్యం చేయకుండా ప్రైవేట్ హాస్పిటల్‌లో స్కానింగ్, ఎక్స్ రే చేయించుకోవాలని సూచించారనివాపోయారు. నర్సీపట్నంలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో పరీక్షలు చేయించగా ఇంజెక్షన్ కారణంగా ఎముకకు ఇన్ఫెక్షన్ వచ్చిందని, రోజుకు రూ.4వేలు ఖర్చు అవుతుందని, నెలరోజులు చికిత్స తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్లు వారు తెలిపారు. ఈ నివేదికలను తిరిగి చింతపల్లి ఆసుపత్రిలోని చిన్నపిల్లల వైద్యులకు చూపగా, ఇది ఇంజెక్షన్ వల్ల వచ్చిన ఇన్ఫెక్షన్ కాదంటూ వైజాగ్ కెజిహెచ్‌కు రిఫర్ చేశారన్నారు. ప్రస్తుతం కెజిహెచ్‌లో శిశువు ఆరోగ్యం క్రిటికల్‌గా ఉందని ఆవేదన చెందుతున్నారు. అక్కడి చిన్నపిల్లల ఎముకల నిపుణులు మాత్రం ఇంజెక్షన్ వల్లే ఎముకకు ఇన్ఫెక్షన్ వచ్చిందంటున్నారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేయించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, తమ బిడ్డకు అత్యుత్తమ వైద్యం అందించేందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలని వేడుకుంటున్నారు. తమ బిడ్డకు న్యాయం జరిగే వరకు పోరాడతామని దంపతులు హెచ్చరించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బిడ్డ వద్ద తల్లిదండ్రులు

మంత్రికి కాంట్రాక్టు ఉద్యోగుల వినతి

మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీలోని వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ గిరిజన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు కాంట్రాక్ట్ గిరిజన ఉద్యోగులు ఆదివారం స్వయంగా వినతి పత్రం అందజేశారు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు లో జరిగిన బిర్సా ముండా జయంతిలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి గిరిజన ప్రాంత వైద్యారోగ్య కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు కే. లక్ష్మణరావు, మమ్ముట్టి కలిసి వినతి పత్రం . అందజేశారుఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో వారు మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా గిరిజన ప్రాంతంలోని అతిమారుమూల గ్రామాలకు వెళ్తూ ఆదివాసి ప్రజానీకానికి క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య సేవలో అందిస్తున్న కాంట్రాక్టు పారామెడికల్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కోరారు. ఉద్యోగ భద్ర కల్పించాలని కోరారు. చాలీచాలని జీతాలు ఇస్తున్నప్పటికీ ఎప్పటికైనా ఉద్యోగం రెగ్యులర్ అవుతుందన్న ఉద్దేశంతో కుటుంబాన్ని నెట్టు కొస్తున్నామని తెలిపారు. కాంటాక్ట్ ఉద్యోగులకు న్యాయం చేయాలని వారు మంత్రిని కోరారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి స్పందిస్తూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడమా? లేదంటే 100శాతం గ్రాస్ శాలరీ ఇవ్వడమా? పరిష్కారం దిశగా ప్రభుత్వం ఆలోచిస్తుందని తెలిపారు.

నేడు కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కాశీపట్నం: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటుకరణకు వ్యతిరేకంగా అరుకు నియోజకవర్గ శాసనసభ్యులు రేగం మత్స్య లింగం ఆదేశాల మేరకు అనంతగిరి మండలం వేంగడ పంచాయతీలో ఈనెల 17న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుందని వైసిపి మండల అధ్యక్షులు కొర్ర సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు స్వయంగా హాజరవుతున్నారని, ఎంపీపీ,వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల కమిటీ నాయకులు హాజరు కావాలని కోరారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో దేవవరం గ్రామ శివారులో ఆదివారం పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. 6 గురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ.6070 లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిరంతరం నిఘా ఉంటుందన్నారు.

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి పోలీసు స్టేషన్ పరిధిలో వివాహిత అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. దివీస్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న వీరవల్లి ప్రసన్నకుమార్ (32) భార్య టి.నందిని (21), వీరి ఆరు నెలల బాబుతో కలిసి తగరపువలస టీచర్స్ కాలనీలో నివాసముంటున్నారు. గత నెల 14వ తేదీ మధ్యాహ్నం ప్రసన్నకుమార్ డ్యూటీకి వెళ్లి రాత్రి 11గంటలకు ఇంటికి వచ్చారు. బాబు ఉయ్యాలో ఉన్నాడు. భార్య కనిపించక పోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. బంధువులకు తెలియజేసినప్పటికీ ఎటువంటి ఆచూకీ లభించలేదు. దీంతో ప్రసన్నకుమార్ భీమిలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ భరత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపిలో టిడిపి కార్యకర్తల చేరిక

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీ నడిమివలస గ్రామంలో ఆ పంచాయతీ టీడీపీ మండల అధ్యక్షుడితో పాటు మరో 200 మంది నాయకులు, కార్యకర్తలు వైసిపి పార్టీలో చేరినట్లు స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం చెప్పారు. నడిమి వలస గ్రామంలో శనివారం టిడిపి కార్యకర్తలకు ఎమ్మెల్యే సమక్షంలో వైసిపి కండువాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడిపి పార్టీ అవలంబిస్తున్న విధి విధానాలు నచ్చక ఆ పార్టీ నుంచి అరమ పంచాయితీ టిడిపి అధ్యక్షుడు వి ఆనంద్ రావు తో పాటు ముఖ్య నాయకులు పి శ్రీను, వి గంగాధర్ ,వి ఉర్డోబ్ ,పి దేవగన్,పి రామన్న తోపాటు మహిళలు సైతం చేరారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అరకులోయ జడ్పిటిసి ఎస్ రోషిణి,వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్ సర్పంచ్ లు నాగేశ్వరావు,వెంకటరావు,వైసిపి యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణక్య, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కే అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు పి పరశురాం, యువజన విభాగ మండల కార్యదర్శి ఎం శంకర్, కే విజయదశమి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

ప్రజాశక్తి-చింతపల్లి : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లి మండల కార్యాలయ కాంప్లెక్స్ ఆవరణలో ఎపి సిఆర్. మీడియా అకాడమీ చైర్మన్ అలపాటి సురేష్‌కుమార్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయూ) సెక్రటరీ జనరల్ సోమసుందర్ మొక్కలు నాటారు.కార్యక్రమంలో చింతపల్లి సీఐ వినోద్‌బాబు, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి సిహెచ్‌బిఎల్. స్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.నాగరాజు, ఎపిఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్, చింతపల్లి ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు వి.దయానంద్, అధ్యక్షుడు డి.సతీష్, కార్యదర్శి పద్మరాజు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు వనరాజు, కార్యదర్శి అప్పలరాజు, ఐజెయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎడి బాబు, నర్సీపట్నం ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు విజయ్ పాల్గొన్నారు. పత్రికారంగంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లు, బాధ్యతలు, సామాజిక బాధ్యతలపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

చింతపల్లిలో మొక్కలు నాటుతున్న జర్నలిస్ట్ ప్రతినిధులు

మయోపియాపై అవగాహన

- బీచ్ రోడ్డులో 300 మందితో ర్యాలీ

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: భారతదేశంలో, ముఖ్యంగా పిల్లల్లో మయోపియా (హ్రస్వదృష్టి) వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విశాఖపట్నంలోని ఎల్‌వి ప్రసాద్‌నేత్ర వైద్యశాల, జిఎంఆర్ వరలక్ష్మి క్యాంపస్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. నవంబర్ 10 నుంచి 16 వరకూ నిర్వహించిన 'పిల్లల నేత్ర సంరక్షణా వారోత్సవాలు' ఈ ర్యాలీతో ఘనంగా ముగిశాయి.ఉదయం బీచ్‌రోడ్‌లోని కాళీమాత గుడి నుండి వైఎంసిఎ వరకూ సుమారు 300 మంది పిల్లలు , వారి తల్లిదండ్రులతో భారి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌విప్రసాద్ కన్సల్టెంట్ పిడియాట్రిక్ ఆప్తాల్మజిస్ట్ డాక్టర్ అదితి పారిఖ్ సమీర్‌బాయ్ మాట్లాడుతూ పిల్లలను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలని వస్తువులను సరిగా గుర్తించలేకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాక్‌థాన్

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: ప్రపంచ ప్రీమెచ్యూరిటీ దినోత్సవం సందర్భంగా, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, బర్త్ రైట్ బై రెయిన్‌బో సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నంలో ప్రీమెచ్యూరిటీపై అవగాహన కల్పించడానికి రామకృష్ణ బీచ్ కాళీమాత ఆలయం నుండి వైఎంసిఎ వరకూ వాకథాన్ నిర్వహించారు. వాకథాన్‌లో ప్రజాప్రతినిధులు సహా 600 మందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ వినయ్ మాట్లాడుతూ, 'ముందస్తుగా జన్మించిన శిశువులు చాలా బలహీనంగా ఉంటారు, వారికి ప్రత్యేకమైన సంరక్షణ అవసరం అటువంటి సదుపాయాలు అన్నీ రెయిన్‌బోలో ఉన్నాయన్నారు. ఈ వాకథాన్‌లో డాక్టర్ వినయ్. ఎపి రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, టిఎన్ జోనల్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రెసిడెన్షియల్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ప్రెసిడెన్షియల్ స్కూల్ తమ వార్షిక దినోత్సవాలను 'ఒడిస్సీ 2025 ఎక్స్‌ప్లోరింగ్ న్యూ హారిజన్స్' అనే థీమ్‌తో ఆదివారం కళాభారతిలో వైభవంగా నిర్వహించింది. కార్యక్రమానికి ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్ కమాండర్ అనిరుద్ధరాయ్ విశిష్ట అతిథి, సెంచూరియన్ విశ్వవిద్యాలయం కులపతి జి.ఎస్.ఎన్.రాజు అతిథి, హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ మాజీ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు దేశ సమైక్యత కోసం పాటుపడాలని ప్రేరేపించారు.స్కూల్ డైరెక్టర్ డి.ఎస్.ఆనంద్, ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు

దేశ ఆర్థిక సంపదకు కాపలాదారులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఇంజనీర్లు, వాల్యూయర్స్ దేశ ఆర్థిక బలానికి కాపలాదారులని, 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. దక్షిణ నియోజవర్గం దొండపర్తిలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో ఆదివారం చార్టెడ్ ఇంజనీర్లు (వాల్యూయర్స్) విశాఖపట్నం ఆర్థిక కారిడార్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దినకర్ మాట్లాడుతూ విశాఖపట్నం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికశక్తి కేంద్రంగా ఎదుగుతున్న ఈ సమయంలో, వీరి భాగస్వామ్యం అత్యంత కీలకం అని పేర్కొన్నారు.

తెలుగు భాషపై ప్రభుత్వ కుట్రలను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: తెలుగు భాషపై కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను వ్యతిరేకించాలని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి పిలుపునిచ్చారు. తెలుగుదండు ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న 'టిట్టిభ సత్యాగ్రహం ఆదివారం నాటికి ఏడో రోజుకు చేరుకుంది. తెలుగుభాష రక్షణ కోసం చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలో పలువురు సాహితీవేత్తలు, కళాకారులు, పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఫణిశయనసూరితో పాటు పలువురు వక్తలు మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి విద్యార్థులను రెంటికీ చెడ్డ రేవడులను చేసిందని అప్పట్లో విమర్శించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పాఠశాల విద్యనే సర్వనాశనం చేస్తోందని దుయ్యబట్టారు. యుద్ధప్రాతిపదికన, అధికార భాషాసంఘాన్ని ఏర్పాటు చేయాలని, సుప్రీంకోర్టులో ఉన్న ఆంగ్లమాధ్యమ వ్యాజ్యాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, ప్రాథమిక విద్యాబోధన తెలుగులోనే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పెదవీర్రాజు, డి.వి.సూర్యారావు, డాక్టర్ విజయగోపాల్, కందళం కనకమహాలక్ష్మి, ధర్మావతి, నాగుల శ్రీనివాస్, భాగవతుల సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీధర్, రవిమోహన్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు, శివజ్యోతి, బాదం జ్యోతి, నాగేంద్ర మణి, సంధ్యా ప్రియదర్శిని, తుని నాగమణి, డప్పు సముద్రం, బాబూరావు, సన్యాసిరావు, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి 'పాపిట' కొండలు..

పాపికొండల యాత్రకు అపూర్వ ఆదరణ

ప్రకృతి ప్రేమికులకు ఓ వరం ఈ యాత్ర

ప్రయాణానికి సిద్ధంగా ఉన్న బోట్లు

ప్రజాశక్తి- విఆర్‌పురం : పాపిట కొండలు..ఈ పేరు వినని వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. గోదావరి అంటే ఎంత అనుబంధమో, అలాగే పాపిట కొండలు కూడా తెలియని వారుండరు. అంతర్రాష్ట్రంగా కూడా ఖ్యాతి గడించి ఎంతో మంది ప్రకృతి ప్రేమికుల మదిని దోచే సుందరమైన ప్రాంతం పాపి హిల్స్ (పాపికొండలు) ఇక్కడ గోదావరిలో బోటు ప్రయాణం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా వరరామచంద్రపురం మండలం పోచవరం గ్రామంలో పాపికొండలకు వెళ్లే యాత్రికులకు బోటు యాజమాన్యం సకల సౌకర్యాలు కల్పిస్తూ బోటు షికారు ఏర్పాటు చేశారు. ఎపి టూరిజం ఆధ్వర్యంలో క్రమశిక్షణ కలిగిన, సెక్యూరిటీతో ఇక్కడ నుండి పాపికొండల టూరు వెళతారు. తూర్పు, పశ్చిమగో దావరి ఏలూరు జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దుల కలయికలో ప్రవిత్ర గోదావరి నదిలో పాపికొండలు విస్తరించిఉన్నాయి. ఇక్కడ విహారయాత్ర మరుపురాని మధుర జ్ఞాపకం.

చూడదగిన ప్రదేశాలు...

ఉదయం బోట్ పాయింట్ వద్ద 8 గంటల నుండి టూరిజం వారు యాజమాన్యం టిఫిన్, మధ్యాహ్నం రుచికర మైన భోజనం, తిరుగు ప్రయాణంలోసాయంత్రం అల్పాహారవిందు స్నాక్స్ ఏర్పాటు వచ్చిన టూరిస్టను ఎంతో చక్క గా రిసీవ్ చేసుకొని గైడ్ ద్వారా పాపికొం డల విశిష్టత చెప్పడం జరుగుతుంది. గలగల పారే గోదావరి నది పొడవునా ఎత్తైన పాపికొండల మ ధ్యలో నిశబ్దంగా ప్రవహించే గోదారమ్మ పరవళ్ళు ఆహ్లాద భరితంగా ఉంటుంది. యాత్ర మొదట ఏలూరు జిల్లా పేరంటాలపవల్లిలో ప్రసిద్ధ శైవ క్షేత్రం శివాలయం రామకృష్ణ మునివాటం, ఇక్కడే ఎత్తైన కొండల నుండి జాలు వారేజలపాతాలు ప్రత్యేక ఆకర్షణ అనిచె ప్పొచ్చు. అక్కడ నుండి కొంచెం ముందుకు సాగితే కొల్లూరు గ్రామం ఇక్కడే మొదలు అవుతాయి పాపికొండలు. గోదావరి నది దగ్గరగా ప్రక్కనే చూడము చ్చటగా కొండలు వచ్చని ప్రకతి పరిచిన అడవితల్లి సోయగాలు పక్షుల కిలకిల రావాలు ఇలా ఎంత చూచినాచూడాలనిపించే విహార యాత్ర పాపికొండలు

ఎలా వెళ్లాలి..

తెలంగాణ నుండి వచ్చే టూరిస్టులు భద్రాచలం చేరుకొని అక్కడనుండి ఉదయం 8 గంటలకు బయలుదేరి విఆర్ పురం మండలం పోచవరం చేరుకుంటే అక్కడ గోదావరి ఒడ్డున బోట్లు సిద్ధంగా ఉంటాయి. అక్క డ నుండే యాత్ర మొదలు అవుతుంది. పట్టణాల్లో వివిధ ఉద్యోగాల్లో బిజి బిజీగా ఉండే వారు పరిశ్రమలో ఫ్యాక్టరీలలో ఒక్క క్షణం కూడా ఖాళీ లేక ప్రశాంతత కోసంఎదురు చూసే వారికి యావత్తు ప్రకృతి ప్రేమికులకు పాపికొండలు విహార యాత్ర మరచిపోని మరుపురాని తీపి గురుతులుగా చెరగని ముద్ర వేస్తుంది.

కోలాహలంగా ఉన్న లాంచీలు, బోట్లు

'చింత' తీరేనా..!

అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధి మండలం దారకొండ గుమ్మరేవులు, దుప్పిలివాడ పంచాయతీ పరిధిలోని చింత చెట్లు ఆశాజనకం గా కాసాయి. చింతపల్లి క్యాంప్‌లో చింతచెట్లు కాపు ఆశాజనకంగా ఉండడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది చింత ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. ఈ ఏడాది దిగుబడి బాగుందని కాస్త ఆశగా ఉన్నాడు రైతన్న

\- ప్రజాశక్తి -సీలేరు

ముగిసిన నరెడ్కో ప్రాపర్టీ షో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా నిర్వహించిన నరెడ్కో ప్రాపర్టీ షో ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ప్రారంభోపన్యాసం చేసిన నరెడ్కో రాష్ట్ర అధ్యక్షులు చక్రధర్ మాట్లాడుతూ ప్రాపర్టీ షోకు మంచి ఆదరణ దక్కిందన్నారు. సిఐఐ సదస్సులో 13 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయని, వీటితో విశాఖ రూపురేఖలు పూర్తిగా మారిపోతా యని, అంతర్జాతీయ నగరంగా మారడం ఖాయమని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి దూరదృష్టి. విజన్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ ద్వారా లక్ష కోట్లతో గోదావరి వాటర్ ఇచ్చే కార్యక్రమం రూపుదాల్చబోతుందని తెలిపారు. పారిశ్రామికంగా అచ్యుతాపురంలో అనేక పరిశ్రమలతో పాటు ఉమ్మడి విశాఖలో గూగుల్ డేటా సెంటర్, మిట్టల్ స్టీల్‌ప్లాంట్ వంటివి వస్తున్నాయన్నారు. ప్రముఖ కంపెనీల రాక నేపథ్యంలో రోడ్ల అభివృద్ధి, అనుసంధానం పెరగనున్నాయన్నారు. దీని ద్వారా అనకాపల్లి శివారు ప్రాంతాలు అభివృద్ధిలో దూసుకుపోబో తున్నాయని తెలిపారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ప్రశాంత నగరమని, దేశవిదేశాల్లో ఉండి స్థిరాస్తులు కొనుగోలు చేసినా ప్రశాంతంగా ఉండొచ్చని అన్నారు. అన్ని అనుమతులతో నిర్మాణాలు చేపట్టాలని బిల్డర్లను కోరారు. మున్సిపల్ వాటర్ కూడా ప్రతి అపార్టుమెంట్‌కు వచ్చిన తర్వాతే ఇవ్వాలని, ఆ విధంగా నరెడ్కోవారు కృషి చేయాలని కోరారు. నరెడ్కో నమ్మకమైన సంస్థ అని పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమంలో బంపర్ డ్రాలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నరెడ్కో ఉత్తరాంధ్ర సలహా కమిటీ ఛైర్మన్ ఛోడే పట్టాభిరామ్, రాష్ట్ర అధ్యక్షులు గద్దే చక్రధర్, ఉత్తరాంధ్ర అధ్యక్షులు రమేష్ బాబు, విశాఖ నగర అధ్యక్షులు రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు వెంకన్న చౌదరి, పాపారావు, సుబ్బారావు, మిధున్, ధర్మా తదితరులు పాల్గొన్నారు.

పంచారామాల బస్సులకు ఆదరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపిఎస్ ఆర్‌టిసి ద్వారకా బస్ స్టేషన్ విశాఖపట్నం నుండి ఆదివారం పంచరామాలకు ఆరు బస్సులు బయలుదేరాయి. ఈ సందర్భంగా సంస్థ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ సంవత్సరం కార్తీక మాసంలో పంచరామాలకు మంచి స్పందన వచ్చిందన్నారు. అదేవిధంగా అయ్యప్ప స్వామి భక్తులకు కూడా ఇప్పటికే విశాఖపట్నం నుండి ఐదు బస్సులు బుక్ అయ్యాయని, ఇంకా మరిన్ని బస్సులు శబరిమల యాత్రకు బయలుదేరుతాయని, ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.